సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 30 । మార్చి । 2025



నవ విశ్వాసం

- నేడు విశ్వావసునామ ఉగాది పర్వదినం
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలకు ఆలయాలు సిద్ధం

కష్టసుఖాల కలయికలతో తీపి, చేదు జ్ఞాపకాల క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. వనాలన్నీ చిగురించే వేళ, పూల పరిమళాలు వెదజల్లే వేళ.. కోయిలమ్మల కుహుకుహూ రాగాలు.. వెలుగులు పంచే విశ్వావసునామ తెలుగు సంవత్సరానికి ప్రజలు ఆదివారం ఘన స్వాగతం పలికేందుకు సిద్ధం అయ్యారు. వసంత రుతువు ఆగమనంతో చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయం నుంచి తెలుగు నూతన సంవత్సరం జరుపుకోవడం ఆనవాయితీ. ఉగాది అంటే కష్టసుఖాల కలయిక. షడ్రుచుల వేడుక. నూతన వస్త్రధారణ, ఆలయాల సందర్శనం, ఇష్ట దైవాల ఆరాధనతోపాటు.. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, పిండి వంటల తయారీ ప్రత్యేకం. నేడు విశ్వావసు నామ ఉగాది సందర్భగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పంచాంగ పండితులు, కవులు, అలనాటి పండుగ వేడుకలు.. ప్రత్యేకతలు తదితర అంశాలతో కథనం.

58 ఏళ్లుగా పంచాంగ పఠనం



ముస్తాబాద్(సిరిసిల్ల): ఉగాది పంచాంగ పఠనం 1967 నుంచి చేస్తున్న. మా నాన్న గారు పరమపదించాక పౌరోహిత్యం చేపట్టాను. తెలుగు సంవత్సరాలు అరవై ఉండగా, మరో రెండేళ్లు గడిస్తే అన్ని సంవత్సరాలకు పఠనం చేసిన వ్యక్తిగా నిలుస్తా. ఆ రోజుల్లో ఉగాది రోజు మద్దికుంట శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి ఊరంతా వచ్చేవారు. పాడి, పంట, వర్షాలు, ఆదాయ వ్యయాలను రైతులు అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ముందుగానే తెలుసుకుంటున్నారు. నేను రైతుగా, ప్రజాప్రతినిధిగా, అర్చకులుగా గ్రామానికి విశిష్ట సేవలు అందించాను.

– మెట్టు రామశర్మ, మద్దికుంట, సిరిసిల్ల

ఆ ఉత్సాహమే లేదు



సిరిసిల్ల: ఉగాది రోజున స్నానాలు చేసి పొద్దుగాలనే పొలంకాడికి పోయేవాళ్లం. వేపపువ్వు, మామిడికాయలు, మామిడి ఆకు, కొత్త చింతపండు తీసుకుని వచ్చి కొత్త కుండలో ఉగాది పచ్చడి చేసేవాళ్లు. కొబ్బరికాయ కొట్టి పచ్చడి పెట్టేదాకా ఇంట్లో నుంచి బయటకు వెళ్లకపోయేది. బక్ష్యాలు తిని వెళ్లి పంచాంగం వినేవాళ్లం. వచ్చే ఏడాదంతా ఎలా ఉంటుంది. ఏ రాశి వారికి రాబడి ఎంత.. ఖర్చు ఎంత..? తెలుసుకుని మురిసిపోయేవాళ్లం. ఈ రోజుల్లో ఆ ఉత్సాహమే లేదు.

– భైరి ప్రభాకర్, వెంకంపేట, సిరిసిల్ల

ఓదెల మల్లన్న సన్నిధిలో వాహన పూజలు

ఓదెల: పెద్దపల్లి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉగాది పండుగ రోజున వాహనాల పూజలు నిర్వహిస్తుంటారు. ఉగాది రోజున వాహన పూజలు చేస్తే అంతా శుభం జరుగుతుందని నమ్ముతుంటారు. పండుగ రోజున మల్లన్న ఆలయం వాహనాల పూజలతో కిక్కిరిసిపోతుంది. పూజలకు వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

అర్చకులకు పురస్కారాలు

కరీంనగర్‌కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు అర్చకులకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలు ప్రకటించింది. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ అర్చకుడు టి.కపిందర్‌స్వామి, కరీంనగర్ మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు పి.నరసింహచార్యులు, వేములవాడ ఆలయ అర్చకుడు జగన్‌మోహన్ ఉపాధ్యాయుల, కే.వెంకటయ్య ఉన్నారు. దీపదూప నైవేద్య అర్చకుల్లో కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ శివాలయం అర్చకుడు పి.శివప్రసాద్ ఉన్నారు. వీరిని నేడు హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారం, రూ.10,116తో సత్కరించనున్నారు.

- 8లో ▸

అలరించిన కవి సమ్మేళనాలు



హనుమాన్ ఆలయంలో కవులకు సత్కారం

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనాలు అలరించాయి. సిరిసిల్ల సాహితీ సమితి సారథ్యంలో గాంధీనగర్ హనుమాన్ ఆలయంలో జరిగిన కవి సమ్మేళనంలో చింతోజు భాస్కర్, కరుణాల భద్రాచలంను సత్కరించారు. డాక్టర్ జనపాల శంకరయ్య, గోశికొండ మురారి, దామోదర్, బూర దేవానందం, వెంగల లక్ష్మణ్, గుండెల్లి వంశీ, రమేశ్, సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనంలో..

మానేరు రచయితల సంఘం గ్రంథాలయ భవనంలోని కవి సమ్మేళనానికి డాక్టర్ కందేపి రాణీప్రసాద్, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం హాజరయ్యారు. సినారె చిత్రపటానికి నివాళి అర్పించారు. మడూరి అనిత వెలువరించిన రంగుల గొడుగు కవితా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం కవులు వర్తమాన సామాజిక పరిస్థితులపై స్పందించి రాసిన కవితలను గానం చేశారు. మారసం ప్రతినిధులు ఎలగొండ రవి, టీవీ నారాయణ, ఆడెపు లక్ష్మణ్, మడూరి అనిత, శ్రీమతి, మోత్కుల భాగ్యలక్ష్మి, ఈడెపు సౌమ్య, అన్నల్‌దాస్ కరుణాకర్, కామారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, నాయకులు

వేములవాడ: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ముస్లింలకు శనివారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు ప్రసాద్‌రావు, అబూబకర్, టౌన్ సీఐ వీరప్రసాద్‌లతో కలిసి హాజరయ్యారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ మాసం కోసం అధికారులతో ప్రత్యేక ఏర్పాట్లు చేయించినట్లు చెప్పారు.

నిక్కర్ పోయి ప్యాంట్ వచ్చే..

- హైస్కూల్ విద్యార్థులకు ప్యాంట్స్
- ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్



2024 జూన్‌లో ప్రచురించిన కథనం

ముస్తాబాద్(సిరిసిల్ల): మేము పెరిగాం.. పెద్ద వాళ్లమవుతున్నం.. నిక్కర్లు వేసుకోవాలంటే సిగ్గుగా ఉందంటూ హైస్కూల్ విద్యార్థులు యూనిఫామ్స్‌పై స్పందించిన తీరు గతంలో చూశాం. ఆరు, ఏడు తరగతుల బాలుర విద్యార్థులకు ఇప్పటి వరకు యూనిఫామ్స్‌లో నిక్కర్లు మాత్రమే ఇచ్చారు. తాము నిక్కర్లు ధరించలేమని గతేడాది జూన్ 19న విద్యార్థుల నిక్కర్ల ఇబ్బందులపై 'సాక్షి'లో 'మేము నిక్కర్ వేసుకోలేం' శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే అప్పటికే విద్యార్థులకు నిక్కర్లు, ప్యాంట్లు పంపిణీ పూర్తయిందని అధికారులు వివరణ ఇచ్చారు. ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే ఆరు నుంచి పదోతరగతి చదివే విద్యార్థులకు ప్యాంట్లు అందించాలని సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు అవసరమైన బట్ట అందించాలని, యూనిఫామ్స్ కుట్టించాలని మెప్మాకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని హైస్కూల్ చదివే విద్యార్థులందరికీ ఇక ప్యాంట్లనే అందించనున్నారు.

అగ్నివీర్‌కు లక్ష్మీపూర్ యువకుడు

- సేవచేయడమే లక్ష్యం అంటున్న సాయితేజ



సాయితేజ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆటోడ్రైవర్ కొడుకు అగ్నివీర్‌గా ఎంపికవడంతో ఆ గ్రామంలో ఆనందోత్సాహాలు నిండాయి. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వట్టిమల్ల లక్ష్మీరాజం–రాణి రెండో కొడుకు వట్టిమల్ల సాయితేజ ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్‌గా ఎంపికయ్యాడు. తండ్రి లక్ష్మీరాజం ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా.. తల్లి రాణి వ్యవసాయ కూలి పనులు చేస్తోంది. ఇంటర్ సీఈసీ పూర్తిచేసి ప్రస్తుతం బీకామ్ ఫస్టియర్ చదువుతున్నాడు. రెండేళ్లుగా కరీంనగర్‌లో శిక్షణ తీసుకుంటూ గతేడాది ఏప్రిల్‌లో అగ్నివీర్ పరీక్షలు రాయగా మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాడు.

షడ్రుచుల సమ్మేళనం



గుర్రాన్నే కాదు.. స్వారీ చేస్తూ వచ్చిన
రాజుతో సహా నిర్లక్ష్యంగా నిలబెట్టే రారాజుల్లా..
విహారం చేసే సమయాన్ని మనమిప్పుడు
నిర్దయతో నిలబెట్టాలి
ఎడతెరిపి లేకుండా ఎంతసేపని నిలబడుతాం..
ఊపిరి బిగబట్టుకొని ఎంతని పరుగెడతాం..
ఈ పరుగు మనకోసమా.. మంది కోసమా
జవాబు తేల్చుకోవాలిప్పుడు

మామిడి ఆకుల్ని.. తీగదారుల్ని తాజాతాజా
పూవుల్ని.. ఇంట్లో లాగే మనసంతా
అలంకరించుకుంటూ హాయిగా గడిపేయాలి!
ఈ చిగుళ్ల మధ్య చిన్నారుల్లా..
ఆదమరిసి ఇలాగే ఉండిపోవాలి

అన్నీ మడిచి మనసంతా తుడిచి
ప్రకృతి లాగే మనమూ పచ్చని
శోభితులం కావాలి
రేపటి చెడు ఘడియల్ని ఒంటి చేత్తో ఎత్తేసి
శక్తిని షడ్రుచుల్లో మేళవించుకోవాలి
మనమిప్పుడు కవన రాగాలమై..
పవన మేఘాలమై..
అలాఅలా సంబరాల అలలమై పోవాలి..

ఇదంతా..
పంచాంగంలో పొంచ జన్యాన్ని స్ఫూరింపజేసు
కొని మళ్లీ మరెన్నో ఉగాది ఉషస్సులకేసి సాహస
ఉత్సాహాలతో సాగడం కోసమే సుమా..
– సేకరణ : గోదావరిఖనిటౌన్

నవ విశ్వాసం



- తరాలు మారుతున్నా.. తరగని సంప్రదాయం
- నాటి కట్టు, బొట్టుతో ఇష్టదైవాల ఆరాధన
- నేడు ఉగాది పండుగ

కాలాగమనంలో మరో తెలుగు సంవత్సరం గతించింది.. కొత్త ఆశలు.. సరికొత్త ఊసులతో విశ్వావసు నామసంవత్సరం ఆదివారం ఆరంభమవుతుంది. చీకటి వెలుగులున్న ప్రపంచంలాగే కష్టసుఖాల కలబోతగా మనిషి జీవితం సారూప్యతను కలిగి ఉంటుందనే నిజాన్ని ప్రతీకాత్మకంగా పట్టి చూపించేదే ఉగాది. తీపి చేదులతో పాటు షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడి సేవనం కూడా జీవితంలో ఆటుపోట్లను సమంగా స్వీకరించాలనే తాత్వికతను సంబోధిస్తుందీ పండుగ. ఇష్ట దైవాల ఆరాధనతో రాబోయే ఏడాదంతా సుఖ సంతోషాలను ప్రసాదించాలనే ఆకాంక్షతో ప్రజలు ప్రార్థన జరిపే పండుగ. కానీ...మారిన కాలమాన పరిస్థితుల్లో పండుగల ప్రత్యేకత క్షీణిస్తుంది. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ప్రపంచీకరణ ప్రభావంతో 'సెల్' మాయాజాలంలో పండుగలు విశిష్టతను కోల్పోతున్నాయి. ఈనేపథ్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పలువురు సంప్రదాయాలను పాటిస్తున్నారు. నాటి కట్టు, బొట్టుతో పండుగల విశిష్టతను కాపాడుతున్నారు. ఆదివారం విశ్వావసు ఉగాది సందర్భంగా ప్రత్యేక కథనం..!!

కొత్త బట్టలతో మురిసిపోయేటోళ్లం



సిరిసిల్ల: మాది సొంతూరు బెజ్జంకి దగ్గర దాచారం. నేను పుట్టక ముందే మా నాన్న సిరిసిల్లకు వచ్చాడు. నా వయసు ఇప్పుడు 63 ఏళ్లు. మా చిన్నప్పుడు ఉగాది పండగ అంటే.. ఇంట్లో కొత్త బట్టలు కుట్టించేవాళ్లు. అవి వేసుకుని మురిసిపోతూ పంచాంగ శ్రవణం వినేవాళ్లం. ఉగాది పచ్చడి ఆకులల్ల పోసేటోళ్లు. ఎంతో సంతోషంగా అది తాగేటోళ్లం. ఇంట్లో పోలెలు చేస్తే.. ఇద్దరు అక్కలు, ఒక చెల్లె, అన్నతో కలిసి ఇంట్లో సంబురంగా తినేవాళ్లం. ఉగాది పండగ అంటే ఇంటిల్లిపాదికి ఎంతో ఆనందం ఉండేది.
– డాక్టర్ గాజుల బాలయ్య, విద్యానగర్, సిరిసిల్ల

ఊరంతా తిరిగి ఆడుకునేవాళ్లం



సిరిసిల్ల: మా చిన్నతనంలో ఉగాది పండగ వచ్చిందంటే ఊరంతా తిరిగి ఆడుకునేవాళ్లం. కుడుకల పేర్లు, బచ్చీల పేర్లు మెడలో వేసుకుని సంబురంగా తిరిగేటోళ్లం. గుడికాడికి వెళ్లి పంచాంగం వినేటోళ్లం. ఇలా ఊరంతా అక్కడికి వచ్చి ఎంతో సంతోషంగా పండుగ జరుపుకునేది. ఇప్పుడు ఆ ఉత్సాహం లేదు.. ఉల్లాసం లేదు. ఏమైనా సెల్ ఫోన్ చూస్తూ.. మనుషులు పరాయివాళ్లలాగే ఉంటున్నారు. మా రోజుల్లో ఉగాది పండగ అంటే ఏడాదికో దినం. పిల్లల అంతా కలిసి సంబురంగా ఆటలు ఆడేది.
– బానోత్ గన్యానాయక్, చిన్నబోనాల, సిరిసిల్ల

ఊరంతా పండుగే..



సిరిసిల్ల: వేములవాడ మండలం రుద్రవరం సొంతూరు. మా ఊరిలో ఉగాది పండగ రోజు ఊరంతా పండుగే. కుల, మత బేధాలు లేకుండా అందరూ పండుగ జరుపుకునేవారు. కాడెద్దులకు, కచ్చురాలకు జాజు పూసి, సున్నం బొట్లు పెట్టి వ్యవసాయ ప్రారంభోత్సవ పండగ చేసేవాళ్లం. పంచాంగ శ్రవణం విని ఏడాది పొడువునా వర్షాలు ఎలా ఉన్నాయి.. తదితర అంశాలపై ఆసక్తిగా చర్చించుకునే వాళ్లం. ఆ రోజులే వేరు.
– రేగులపాటి పాపారావు, మాజీ ఎమ్మెల్యే, సిరిసిల్ల

జిల్లా ప్రజలకు 'విశ్వావసు' వెలుగులు



సిరిసిల్లకల్చరల్: ఈ సంవత్సరంలో నవ నాయకులుగా రాజు, రవి, మంత్రి చంద్రుడు, సైన్యాధిపతి రవి, సస్యాధిపతి గురువు, ధాన్యాధిపతి కుజుడు, మేఘాధిపతి రవి, రసాధిపతి శని, నీరసాధిపతి బుధుడుగా నిర్ణయమైంది. జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు అధిక దిగుబడినిస్తాయి. కూరగాయలకు ధరలు ఉండవు. రాజకీయ నేతల మధ్య సంబంధాలు కొరవడి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. వస్త్రపరిశ్రమకు అనుకూలంగా ఉంటుంది. విద్యావ్యవస్థలో కీలక మార్పులు చోటు చేసుకుంటాయి. – ఆడెపు హరీశ్, అఖిలభారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం ప్రధాన కార్యదర్శి, సిరిసిల్ల

విశ్వశాంతికి పునాది



శిశిర ఋతువుకు వీడ్కోలు పలికి వసంత ఋతువుకు స్వాగతం పలుకుతున్న వేళ ఆరంభం అవుతున్న శ్రీ విశ్వావసు నామ సంవత్సరం విశ్వానికి సంబంధించినది. ఈ సంవత్సరం శుభఫలితాలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాపారులకు మంచి లాభాలు వస్తాయి. కుటుంబ జీవితాలలోను సంతోషంగా ఉంటుంది. దేశాల మధ్య వైరం, యుద్ధ వాతావరణం నుంచి ఉపశమనం లభించే అవకాశాలున్నాయి. విశ్వావసు అంటే ప్రపంచానికి మేలు చేసేవాడు.. అంటే ప్రజలు సహాయక స్వభావం కలిగి ఉంటారు.
– నమిలకొండ రమణాచార్యులు, కరీంనగర్

ఊహ తెలిసినప్పటి నుంచి..



ఇల్లంతకుంట(మానకొండూర్): మాది ఇల్లంతకుంట మండల కేంద్రం. విద్యాభ్యాసం ముగిసిన నాటి నుంచి 50 ఏళ్లుగా సంప్రదాయ దోవతి కమీజు ధరిస్తున్న. హైదరాబాదులోని నిజాం కాలేజీలో 1969లో విద్యాభ్యాసం ముగిసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వేడుకలు, ఎక్కడికి వెళ్లినా దోవతి, కమీజు వేసుకుంటా. 1981 నుంచి 1993 వరకు ఇల్లంతకుంట సర్పంచ్‌గా చేసిన.
– చిట్టి కృష్ణారెడ్డి, ఇల్లంతకుంట

ఏటా కవి సమ్మేళనాలు



కోరుట్ల: స్వేచ్ఛ సాహితీ సమితి.. కోరుట్లలో బహుజన కవిత్వానికి పెట్టింది పేరు. ఏటా స్వేచ్ఛ సాహితీ సమితి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. కవి రాస భూమయ్య అధ్యక్షతన ఏర్పాటైన సాహితీ సమితి కేవలం ఉగాది కవి సమ్మేళనాలకు పరిమితం కాకుండా అభద్రతతో ఉన్న వృద్ధులు, మహిళలు, పిల్లలకు చేయూతగా నిలుస్తుంది.
– రాస భూమయ్య

35 వసంతాలుగా..



గోదావరిఖనిటౌన్(రామగుండం): ఉగాది అనగా యుగానికి ఆది అని అర్థం. 35 ఏళ్లుగా గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న. ఈ ఉగాది విశ్వావసు సంవత్సరం అనగా 11 మంది గంధర్వులలో విశ్వావసుడు ఒకరు. విశ్వ వాసుడు ప్రేమకు ప్రతీక. ప్రజల మధ్య ప్రేమానురాగాలను కలిగిస్తాడు. ఇది శుభ సంవత్సరం. ఈ రోజు ధ్వజారోహణము చేసి, ఇంటిపై ధ్వజమును ఎగుర వేయాలి.
– వొజ్జల వెంకటేశ్వరశర్మ, గోదావరిఖని

మ్యాథమేటిక్ క్యాలిక్యులేషన్



జగిత్యాలటౌన్: విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలుగుతాయి. నలభై ఏళ్లుగా జగిత్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఏటా పంచాంగ పఠనం వినిపిస్తున్న. పంచాంగం ఒక మ్యాథమేటిక్ క్యాలిక్యులేషన్. ఆ క్యాలిక్యులేషన్ ప్రకారం సూర్యునికి రాజు పదవి, చంద్రునికి మంత్రి పదవి రావడంతో పాటు నవగ్రహాలలో 3 శుభగ్రహాలకు చక్కని ఆదిపత్యం దక్కినందున పాలనలో మరింత ఆధిపత్యం పెరిగి ప్రజలకు సత్ఫలితాలు లభిస్తాయి.
– శ్రీమాన్ నంబివేణుగోపాలాచార్య, జగిత్యాల

మా తాతల కాలం నుంచి..



బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 25 ఏళ్లుగా ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. మా వంశంలో తాతలు, తండ్రుల కాలం నుంచి పంచాంగ శ్రవణం చేస్తున్నం. ప్రస్తుత విశ్వావసు నామ సంవత్సరంలో రవి రాజుగా వస్తున్నారు. పంచాంగ శ్రవణంలో రాశి ఫలాలు, ఆదాయ వ్యయాలు, ధాన్యాధిపతి గూర్చి, ఎన్ని తూముల వర్షాలు కురుస్తాయి, పంటలు ఎన్ని పుట్లు పండుతాయి, రాజ్యాధికారం ఎలా ఉంటుంది, స్త్రీ, పురుష జనన ఉత్పత్తి వివరాలు చెబుతాం. ఉగాది రోజు ప్రజలు తమ రాశి ఫలితాలు ఎలా ఉన్నాయోతెలుసుకుంటారు.
– శ్రీనివాసాచార్యులు, బోయినపల్లి

ఇసుక అనుమతులు వివాదాస్పదం





ఆవునూర్‌లో ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు, ఇసుక ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

- ఆవునూర్‌లో ట్రాక్టర్లను అడ్డకున్న గ్రామస్తులు
- ఎల్లారెడ్డిపేటలో తహసీల్ ఆఫీస్‌కు చేరిన పంచాయితీ
- తహసీల్దార్ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్(సిరిసిల్ల): ఇసుక అనుమతులు వివాదాస్పదంగా మారాయి. ముస్తాబాద్ మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఇసుక తరలించేందుకు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ ట్రాక్టర్ యజమానులకు శనివారం అనుమతులు ఇచ్చారు. దీంతో 50కి పైగా ట్రాక్టర్లలో ఇసుకలోడ్‌తో ముస్తాబాద్ మండలానికి వెళ్తుండగా ఆవునూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ మండలంలోని పనులకు పక్క మండలంలోని ట్రాక్టర్‌లకు ఎలా అనుమతులు ఇస్తారంటూ నిలదీశారు. పోలీసులు ఆవునూర్ ట్రాక్టర్ యజమానులను సముదాయించినా వినలేదు. దీంతో ఇసుక ట్రాక్టర్లను వెంకటాపూర్‌కు తిరిగి పంపించారు.

అనుమతులు రద్దు చేసిన తహసీల్దార్

ఆవునూర్‌లో ట్రాక్టర్లను అడ్డుకోవడంతో.. వారికి రాచర్లబొప్పాపూర్‌లోని అభివృద్ధి పనులకు ఇసుక తరలించేందుకు అనుమతించారు. ఈ విషయం తెలుసుకున్న నారాయణపూర్, రాగట్లపల్లి గ్రామాల ట్రాక్టర్ యజమానులు వెంకటాపూర్ ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు. ఈ పంచాయితీ రెవెన్యూ కార్యాలయానికి చేరుకోవడంతో తహసీల్దార్ సుజాత జోక్యం చేసుకుని అన్ని గ్రామాల్లో ఇసుక రీచ్‌లకు అనుమతులు వచ్చే వరకు ఎవరికీ అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఒక వేళ వెంకటాపూర్ ఇసుక రీచ్‌కు అనుమతులు ఇస్తే అందరికీ అక్కడి నుంచే అనుమతులు ఇస్తామని తెలిపారు. ఎవరైనా ట్రాక్టర్లను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంకటాపూర్ ట్రాక్టర్ యజమానులకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది.

'సఖీ'లో పది మంది ఉద్యోగుల తొలగింపు

సిరిసిల్ల: 'సఖీ' కేంద్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 10 మందిని ఏకకాలంలో తొలగించడం చర్చనీయాంశమైంది. 'సఖీ' కేంద్రంలో ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రిక్రూట్ అయిన 13 మందిలో 10 మందిని తొలగించి ముగ్గురికి అవకాశం ఇచ్చినట్లు సమాచారం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించే ప్రైవేటు ఏజెన్సీ టెండర్లలో పాల్గొనకపోవడంతో ఆ ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు సమాచారం. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు రక్షణ కల్పించే లక్ష్యంతో 'సఖీ' కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉండే మహిళలకు రక్షణ కల్పించేందుకు నియమించిన సిబ్బందిని ఏకకాలంలో తొలగించి కొత్త ఏజెన్సీ ద్వారా మళ్లీ నియామకాలు చేస్తున్నట్లు సమాచారం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిరిసిల్ల 'సఖీ' కేంద్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు.. కొత్త ఏజెన్సీ ద్వారా మళ్లీ నియామకాలు జరిపే అంశంపై మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారులు స్పందించేందుకు నిరాకరించారు. ఏది ఏమైనా.. రెక్కాడితే కానీ డొక్క నిండని చిరుద్యోగుల జీవితాలతో ఉన్నతాధికారులు చెలగాటమాడడం అమానవీయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'పది'లో 14 మంది గైర్హాజర్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పదోతరగతి పరీక్షల్లో భాగంగా శనివారం బయాలజీ పరీక్షకు 6,767 మందికి 6,753 మంది విద్యార్థులు హాజరయ్యారు. 14 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు తెలిపారు. సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వ్యక్తి రిమాండ్

సిరిసిల్లక్రైం: మానేరువాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి ఒకరిని రిమాండ్ చేసినట్లు సీఐ కృష్ణ శనివారం తెలిపారు. శాంతినగర్‌కు చెందిన బూర్ల లక్ష్మీనారాయణతోపాటు మరికొందరు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. తనిఖీలలో లక్ష్మీనారాయణ పట్టుబడడంతో రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- జిల్లా వైద్యాధికారి రజిత

సాక్షి ఎఫెక్ట్



మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కోనరావుపేట(వేములవాడ): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందుబాటులో ఉంటూ.. వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి రజిత ఆదేశించారు. 'రాత్రి వేళ..పీహెచ్‌సీలో అందని వైద్యం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఎంహెచ్‌వో శనివారం కోనరావుపేట పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న ఆరోగ్య పథకాలు, పురోగతి గురించి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. తేలుకాటుకు గురైన పని గంగారాం ఇంటికెళ్లి పరామర్శించారు. అనంతరం ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే వారిపై మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్, సీహెచ్‌వోలు బాలచందర్, కృష్ణమూర్తి ఉన్నారు.

ఒకరి మృతి

సిరిసిల్లక్రైం: అంబికానగర్‌కు చెందిన నెల్లుట్ల అంజయ్య(65) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి మద్యం సేవించిన అంజయ్య ఉదయం ఇంటి ఎదుట విఘతజీవిగా పడి ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలం బస్వాపూర్‌లో చెట్టుపై నుంచి పడి ఒకరు మృతిచెందారు. బంటు ఆనందం(40) చింతచెట్టు ఎక్కి చింతకాయ తెంపుతున్నాడు. ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడికి భార్య రేణుక, కొడుకు మహేందర్, కూతురు శిరీష ఉన్నారు.

చికిత్స పొందుతూ..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్నగంగయ్య బొప్పాపూర్‌కు చెందిన బద్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపరీగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి క్షవరం చేయించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన బిస్క సత్యం తన బైక్‌తో ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ చిన్నగంగయ్యను హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమారులున్నారు.

రంజాన్ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడ: స్థానిక రెండో బైపాస్‌రోడ్డులోని ఈద్గా వద్ద చేపట్టిన ఏర్పాట్లను శనివారం మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ పరిశీలించారు. ఎండలు ముదరడంతో తాగునీరు, షామియానాలు, సౌండ్‌సిస్టమ్ సరిగా ఉండాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేశ్, పట్టణ, బ్లాక్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సాగరం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల బాటలో సిబ్బంది

- బోసిపోయిన మున్సిపల్ ఆఫీస్



ఖాళీగా ఉన్న మున్సిపల్ ఆఫీస్

సిరిసిల్ల: ఇది సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్. ఇదేంది కుర్చీలు ఖాళీగా ఉన్నాయని అనుకుంటున్నారా..! అందరూ విధులకు వచ్చారు. కానీ మార్చి నెలాఖరు కావడంతో ఆస్తి పన్ను వసూళ్లకు వెళ్లారు. బిల్ కలెక్టర్లతోపాటు మున్సిపల్ అధికారులు పట్టణంలోని 39 వార్డుల్లో తిరుగుతున్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో ఇప్పటికే 97 శాతం పన్నులు వసూలు కాగా.. మార్చి 31లోగా వంద శాతం లక్ష్యం సాధించే దిశగా మున్సిపల్ సిబ్బంది చర్యలకు దిగారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ వరుస సెలవులు ఉన్నా ఆస్తిపన్నుల వసూళ్లకు మున్సిపల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆది, సోమవారాల్లోనూ పన్నులు చెల్లించవచ్చని కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఆస్తి పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

కేటీఆర్ ఫ్లెక్సీల తొలగింపు వివాదాస్పదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మెల్యే కేటీఆర్ పేరుతో వెలసిన ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించడం శనివారం వివాదాస్పదమైంది. పదిర, హరిదాస్‌నగర్ బస్టాండ్‌లలో ఎమ్మెల్యే కేటీఆర్ పండుగ శుభాకాంక్షలు చెప్తున్న ఫ్లెక్సీలను అతికించారు. కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో గ్రామపంచాయతీ సిబ్బంది ఆ ఫ్లెక్సీలను తొలగించారు.

క్రైస్తవుల శాంతిర్యాలీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై మండల కేంద్రంలో శనివారం క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ పగడాల మరణించి నాలుగు రోజులు గడుస్తున్నా కేసు విచారణలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కిల్ అధ్యక్షుడు రాజేశ్, పాస్టర్స్ మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పాస్టర్ మధుబాబు, కులేరి కిశోర్‌కుమార్, రూబెన్, జోనాతన్, గిద్యోను, ఏసుదాస్, జోషి, పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.